క్లుప్తంగా

పోలీసులకు ప్రశంస పత్రాలు



ప్రశంసపత్రం అందుకుంటున్న సీఐ

కోరుట్ల: వినాయక చవితి, దసరా, బతుకమ్మ ఉత్సవాలు ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా నిర్వహించిన కోరుట్ల పోలీసులను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ బుధవారం అభినందించారు. సీఐ సురేష్ బాబు, ఎస్సై ఎం. చిరంజీవి, హెడ్ కానిస్టేబుళ్లు తిరుపతి, గంగాధర్‌లను జగిత్యాలలో అభినందించి ప్రశంసా పత్రాలు అందించారు.

సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలి



సీపీఆర్‌పై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

మల్యాల: సీపీఆర్ విధానంతో ప్రతి ఒక్కరూ అవగాహన పెంపొందించుకోవాలని మెడికవర్ ఆస్పత్రి మేనేజర్ గుర్రం కిరణ్ అన్నారు. మల్యాల మండలం నూకపల్లిలోని సూర్య బీఈడీ కళాశాలలో బుధవారం మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యంలో విద్యార్థులకు సీపీఆర్ విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సీపీఆర్ చేసే విధానంపై శిక్షకురాలు లావణ్య విద్యార్థులకు అవగాహన కల్పించారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి సరైన విధానంలో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు. కార్యక్రమంలో కోట కరుణాకర్, చంద్రశేఖర్, మహేశ్ పాల్గొన్నారు.

సీజేఐపై దాడి చేసిన లాయర్‌పై చర్యలు తీసుకోవాలి



రాస్తారోకో చేస్తున్న దళిత నాయకులు

కోరుట్ల: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై కోర్టు హాల్‌లో దాడికి పాల్పడిన లాయర్‌పై చర్యలు తీసురోవాలని ఆల్ ఇండియా అంబేద్కర్ సంఘం, బీఆర్ అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి బుధవారం పూలమాలలు వేసి జాతీయ రహదారిపై ధర్నా, రాస్తా రోకో నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు బలిజ రాజరెడ్డి, మోర్తాడ్ లక్ష్మీనారాయణ, ఉయ్యాల శోభన్, కృష్ణప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు సంఘటన దారుణం

కథలాపూర్: సుప్రీం కోర్టులో సీజేఐపై దాడి జరగడం దారుణమని బీఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నల్ల వర్ధన్, ఉపాధ్యక్షుడు ఎర్రోళ్ల వినీత్ అన్నారు. బుధవారం కథలాపూర్‌లో వారు మాట్లాడుతూ... సుప్రీం కోర్టు సీజేఐకు రక్షణ లేకపోతే ఎలా అంటూ ప్రశ్నించారు. ఈ సంఘటనను ఖండిస్తున్నామన్నారు. ఇటువంటి సంఘటనలు జరగడం దురదృష్టకరమన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో ముమ్మర తనిఖీలు



తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి

మేడిపల్లి: మండల వ్యాప్తంగా ఉన్న ఫర్టిలైజర్ దుకాణాల్లో మండల వ్యవసాయాధికారి షాహిద్ అలీ బుధవారం ముమ్మర తనిఖీలు చేపట్టారు. మేడిపల్లి, కాచారం గ్రామాల్లోని ఫర్టిలైజర్ దుకాణాలకు చెందిన క్రిమిసంహారక మందుల శాంపిళ్లను పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్ పంపించామని అయన అన్నారు. రికార్డులు పక్కాగా నిర్వహించాలని, రైతులకు కొనుగోళ్లకు సంబంధించిన రశీదులు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

రాయికల్: మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్‌లో ఖాళీగా ఉన్న పీజీటీ కామర్స్ పోస్టుకు ఈనెల 10న డెమో నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ సంతోష్ బుధవారం తెలిపారు. ఎంకాం, బీఈడీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈనెల 10 న సర్టిఫికెట్లతో డెమోకు హాజరు కావాలని కోరారు.

చెత్త సేకరణ అంతంతే..

- బల్దియాలో పారిశుధ్య సిబ్బంది కొరత
- రిపేరులో మినీ ఆటోలు
- పట్టణం మొత్తం ఒకే ట్రాక్టర్
- ఇబ్బంది పడుతున్న పట్టణవాసులు



ఒకే ఒక్క ట్రాక్టర్‌తో చెత్త సేకరణ

రాయికల్: పట్టణంలోని మున్సిపాలిటీలో చెత్త సేకరణలో కేవలం ఒకే ఒక్క ట్రాక్టర్ ఉండటంతో పాటు, పారిశుధ్య సిబ్బంది కొరతగా ఉండటంతో చెత్త సేకరణలో మున్సిపల్ సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో వారానికి కేవలం 1–2 సార్లు మాత్రమే చెత్త సేకరణ కోసం సంబంధిత ట్రాక్టర్ లేదా ఆటో వస్తుందని పట్టణ ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెత్త సేకరణపై మున్సిపల్ అధికారులకు చిత్తశుద్ధి కరువైంది.

రాయికల్ మున్సిపాలిటిలో 12 వార్డులు ఉండగా, 3500 గృహాలున్నాయి. వీటిలో ప్రతిరోజు చెత్త సేకరణ కోసం మున్సిపల్ ఆధ్వర్యంలో 6 మినీ ఆటోలు గతంలో కొనుగోలు చేయగా, ప్రస్తుతం 4 రిపేరులో ఉండగా రెండింటిని మాత్రమే వినియోగిస్తున్నారు. ఒకే ఒక్క ట్రాక్టర్ చెత్త సేకరణ కోసం ఉంది. రెండు ట్రాక్టర్లు కొనుగోలు చేయగా చెత్త సేకరణకు, మరొకటి బ్లేడ్ బండికి వినియోగిస్తున్నారు. చెత్త సేకరణకు ఒకే ఒక్క ట్రాక్టర్ బల్దియాలో ఉండటంతో 12 వార్డుల్లోకి వారానికి 1–2 సార్లు మాత్రమే పారిశుధ్య సిబ్బంది వచ్చి చెత్త సేకరిస్తున్నారని, దీంతో ఇంట్లో చెత్త నిల్వ చేయాల్సిన పరిస్థితి నెలకొందని పట్టణ ప్రజలు, మహిళలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

సిబ్బంది కొరత

12 వార్డుల్లో చెత్త సేకరణ కోసం గతంలో 57 మంది పారిశుధ్య సిబ్బంది ఉంటే ప్రస్తుతం 26 మంది మాత్రమే ఉన్నారు. దీనిలో 12 మంది మహిళలు, 8 మంది పురుషులు మాత్రమే ఉండటంతో పట్టణంలో చెత్త సేకరణలో తీవ్ర జాప్యమవుతోంది. పారిశుధ్య మహిళ సిబ్బంది కేవలం ఊడవడం, బ్లీచింగ్ పౌడర్ చల్లేందుకే పరిమితం కావడంతో ఉన్న పురుషులు చెత్త సేకరణ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. వివిధ ప్రభుత్వ కార్యక్రమాలు, పండగల వంటి సమయంలో వీరిపై పనిభారం అవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో లాగా పారిశుధ్య సిబ్బందిని నియమించడంతో పాటు, పట్టణంలో మరో ట్రాక్టర్‌ను కొనుగోలు చేయడంతో పాటు, రిపేరులో ఉన్న ఆటోలను వినియోగంలోకి తీసుకురావాలని పారిశుధ్య సిబ్బందితో పాటు, పట్టణ ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అడిషనల్ కలెక్టర్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ స్పందించి బల్దియాకు మరో ట్రాక్టర్‌ను మంజూరు చేసి, సరిపడా పారిశుధ్య సిబ్బందిని నియమించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

వారానికి రెండు సార్లు వస్తున్నారు



రాయికల్ మున్సిపాలిటిలో పారిశుధ్య సిబ్బంది కొరతతో పాటు, వాహనాలు లేకపోవడంతో మా వార్డుకు వారానికి 1–2 సార్లు మాత్రమే వస్తున్నారు. దీంతో చెత్తను నిల్వ ఉంచడంతో దుర్వాసన, దోమల బెడద తీవ్రతరం అవుతుంది.

– బి.రాజశేఖర్, రాయికల్

అడిషనల్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం



రాయికల్ మున్సిపాలిటీలో ఒకే ట్రాక్టర్ ఉండటంతో చెత్త సేకరణ లేటవుతోంది. సిబ్బంది కొరత వాస్తవమే. ఆటోలను రిపేరు చేయించి వినియోగంలోకి తీసుకువస్తాం. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. పట్టణ ప్రజలు సహకరించాలి.

– మనోహర్‌గౌడ్, మున్సిపల్ కమిషనర్, రాయికల్

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

మల్లాపూర్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. బుధవారం మల్లాపూర్ మండల కేంద్రంలో ఆయన పర్యటించారు. కమ్యూనిటీ భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌కి ఒడ్డెర కాలనీవాసులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి పాలనపై దృష్టి సారించకుండా బీఆర్ఎస్‌ను దూషించడమే పనిగా పెట్టుకున్నాడన్నారు. కేవలం 22 నెలల పాలనతోనే తెలంగాణ పదేండ్లు వెనక్కి వెళ్లిందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన అందిస్తేనే తెలంగాణ పల్లెలు దేశానికే అదర్శ గ్రామాలుగా నిలిచాలయన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జెడ్పీటీసీ స్థానంతో పాటు అన్ని ఎంపీటీసీ స్థానాలను కైవసం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ ముద్దం శరత్‌గౌడ్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బండి లింగస్వామి, అల్లెపు నరేష్, అరికుప్పల రాజం, బోదాసు పాపయ్య, అల్లెపు మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించాలి



అవగాహన కల్పిస్తున్న హెల్త్ సూపర్‌వైజర్

ఇబ్రహీంపట్నం: బిడ్డ పుట్టగానే ముర్రుపాలు తాగించాలని హెల్త్ సూపర్‌వైజర్ సుశీల తెలిపారు. బుధవారం మండలంలోని డబ్బా గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ మహా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల తల్లులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తర్వాత ఆకు కూరలు , కోడి గుడ్లు, పాలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సంజీవరాణి, సుందరగిరి గంగమణి, ఆశ వర్కర్లు రజిత, జ్యోతి, పిల్లల తల్లులు పాల్గొన్నారు.

ముర్రుపాలల్లో రోగ నిరోధక శక్తి ఎక్కువ

రాయికల్: పుట్టిన బిడ్డలకు ముర్రుపాలు పడితే రోగ నిరోధక శక్తి ఎక్కువగా ఉంటుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పద్మావతి అన్నారు. బుధవారం రాయికల్ పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ మాసం సందర్భంగా గర్భిణులు, బాలింతలు, తల్లులకు పోషకాహార పదార్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పుష్పలత పాల్గొన్నారు.

క్రీడలతో మెరుగైన ఉద్యోగ అవకాశాలు



విద్యార్థులతో మంచాల కృష్ణ తదితరులు

జగిత్యాలటౌన్: క్రీడలతో శారీరక, మానసిక వికాసంతో పాటు మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయని ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా కార్యదర్శి మంచాల కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని వివేకానంద మినీ స్టేడియంలో రెండో రోజు బుధవారం జరిగిన క్రీడా పోటీల్లో కబడ్డీ అండర్ –17లో గొల్లపల్లి విద్యార్థులు మొదటి బహుమతి, బుగ్గారం ద్వితీయ బహుమతి, ఖోఖోలో కోరుట్ల ప్రథమ బహుమతి, మెట్‌పల్లి ద్వితీయ బహుమతి, వాలీబాల్‌లో సారంగాపూర్ ప్రథమ, మల్లాపూర్ ద్వితీయ బహుమతి సాధించాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా హాజరైన మంచాల కృష్ణ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రాము, జిల్లా క్రీడల కార్యదర్శి చక్రధర్ రావు, సిరిసిల్ల శ్రీనివాస్,టీవీ సూర్యం, పెటా జిల్లా అధ్యక్షుడు విశ్వప్రసాద్, పెటా కార్యదర్శి అశోక్, పీడీలు పడాల కృష్ణప్రసాద్, శ్రీనివాస్, లక్ష్మీరాం నాయక్, అజయ్‌బాబు, కోటేశ్వర్‌రావు, వెంకటలక్ష్మి, జమునారాణి, మల్లేశ్వరి, పుష్పలత, వేణు, భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

మర్రవ్వ ఆలయానికి సౌండ్ సిస్టం అందజేత

కథలాపూర్: మండలంలోని భూషణరావుపేట శివారులోని మర్రవ్వ ఆలయానికి ఏనుగందుల ఆగయ్య అనే భక్తుడు బుధవారం సౌండ్ సిస్టమ్స్‌ను అందించారు. ఆలయానికి వచ్చే భక్తులకు భక్తి పాటలు వినిపించడానికి ఈ సౌండ్ సిస్టమ్స్‌ను అందించినట్లు దాత ఆగయ్య పేర్కొన్నారు. దాత ఆగయ్యను అర్చకులు ఉశకోల రవి, ఆలయ కమిటీ సభ్యులు సన్మానించారు.

లయన్స్ క్లబ్ సేవలను విస్తృతం చేస్తాం



సరుకులు పంపిణీ చేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు

మెట్‌పల్లి: లయన్స్ క్లబ్ సేవలను మరింత విస్తృతం చేస్తామని అధ్యక్షుడు వెల్ముల శ్రీనివాస్‌రావు అన్నారు. 'పర్సనలైజ్డ్ సర్వీస్ డే'లో భాగంగా పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో బుధవారం పేదలకు బియ్యం, దుస్తులు తదితర సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల కోసం క్లబ్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. రాబోయే రోజుల్లో సేవలను మరింత విస్తృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో చంద్రశేఖర్, ఇల్లెందుల శ్రీనివాస్, తుక్కారాం, మర్రి భాస్కర్, కలిగేటి మల్లేశ్ తదితరులున్నారు.

రాయికల్: పట్టణంలో లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం వ్యక్తిగత సేవా దినోత్సవం సందర్భంగా లయన్స్‌క్లబ్‌లోని ప్రతి ఒక్క సభ్యులు సేవా కార్యక్రమాలు నిర్వహించినట్లు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు రంజిత్ తెలిపారు.

తెలంగాణ యంగ్ ఫిల్మ్ మేకర్‌గా కునమల్ల సుమన్



రాయికల్: మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన కునమల్ల సుమన్ రూపొందించిన పుట్టింటి గౌరమ్మకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన యంగ్ ఫిల్మ్ మేకర్ ఛాలెంజ్‌కు షార్ట్‌ఫిల్మ్ ఎంపికైంది. త్వరలోనే ప్రభుత్వం నుంచి ప్రశంసా పత్రం అందుకోనున్నారు. ఈ సందర్భంగా ఆయనను గ్రామస్తులు అభినందించారు.

24 న పంచాయతీ యూనియన్ మహా సభలు

జగిత్యాలటౌన్: ఈనెల 24, 25 తేదీల్లో మహబూబాబాద్ జిల్లాలో పంచాయితీ యూనియన్ రాష్ట్ర ఐదో మహాసభలు నిర్వహిస్తున్నామని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి పుప్పాల శ్రీకాంత్ తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో నాయకులతో కలిసి మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో జీపీ యూనియన్ జిల్లా కార్యదర్శి పులి మల్లేశం, న్యాతరి మల్లవ్వ, తిరుపతి, రాజునాయక్, దేవయ్య, కొండమ్మ, పోశయ్య తదితరులు పాల్గొన్నారు.

కొత్త స్వశక్తి సంఘాలు ఏర్పాటు చేయాలి

జగిత్యాలరూరల్: కొత్త స్వశక్తి సంఘాలను ఏర్పాటు చేయాలని డీఆర్డీఏ పీడీ రఘువరణ్ అన్నారు. బుధవారం జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లిలో మహిళాస్వశక్తి సంఘ సభ్యులు నిర్మించే సోలార్ ప్లాంట్ స్థలాన్ని పరిశీలించారు. ప్రతి గ్రామంలో సంఘాల సమావేశాలు జరిగేలా చూడాలన్నారు. బ్యాంక్, స్త్రీనిధి రుణాలు తీసుకున్న మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకుని ఇతర మహిళలకు ఆదర్శంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం రాజయ్య, సీసీలు గంగారాం, శ్రీనివాస్ పాల్గొన్నారు.

నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి

సారంగాపూర్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఎంపీటీసీ. జెడ్పీటీసీ ఎన్నికల నామినేషన్లకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆయా మండలాల ఎంపీడీవోలుతెలిపారు. మండల పరిషత్ కార్యాలయాల్లో నామినేషన్‌లు దాఖలు చేయాల్సి ఉంటుందని తెలిపారు. ఉదయం 10.30 గంటలకు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేస్తారని, అనంతరం నామినేషన్ల స్వీకరణ ఉంటుందని తెలిపారు.

ప్రమాదకరంగా ఎండిన చెట్టు



ఎండిపోయి ప్రమాదకరంగా చెట్టు

బుగ్గారం: జాతీయ రహదారిపై ఎండిన భారీ వృక్షం ప్రమాదకరంగా మారింది. జగిత్యాల–ధర్మపురి మార్గంలో బుగ్గారం మండలంలోని చిన్నాపూర్‌లో జాతీయ రహదారికి పక్కనే గల ఓ భారీ వృక్షం పూర్తిగా ఎండిపోయి ఎప్పుడు కూలుతుందో తెలియని విధంగా ఉంది. నిత్యం ఈ మార్గంలో వందలాది వాహనాలు వెళ్తుంటాయి. ఎలాంటి ప్రమాదాలు జరగకముందే అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.



ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ వెళ్లే ఆర్అండ్‌బీ డబుల్ రోడ్డులో పెద్ద గుంత పడి ప్రమాదకరంగా మారింది. ప్రమాదం జరుగకుండా ఉండేందుకు గుంతలో సూచికగా చెట్టు కొమ్మలను ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు బిగించారు. అర్అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాలు జరుగకముందే గుంతను పూడ్చివేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సైజాన్, ఆర్అండ్‌బీ ఏఈ, మెట్‌పల్లి, సెల్ నంబర్: 9550384101

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ప్రశంస పత్రాలు



ప్రశంస పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం కల్లెడ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మంగళవారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని టీచర్స్ భవన్‌లో నిర్వహించిన సైన్స్ డ్రామా పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చి ద్వితీయస్థానం సాధించి జిల్లా విద్యాధికారి రాము చేతుల మీదుగా ప్రశంస పత్రాలు అందుకున్నారు. బుధవారం ప్రతిభ కనబర్చిన విద్యార్థులను హెచ్ఎం స్వరూపరాణి, ఉపాధ్యాయులు చిక్కుల రమేశ్, గంగారెడ్డి, శ్రీకళ, రాధలక్ష్మీ, స్వర్ణలత, కల్పన, లావణ్య అభినందించారు.

బెంబేలెత్తిస్తున్న వీధి శునకాలు



రోడ్లపై గుంపులుగా తిరుగుతున్న కుక్కలు

కొడిమ్యాల: మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి అంగడిబజార్ కు వెళ్లే రోడ్డుపైన మసీదు దగ్గర ప్రతీ రోజు రాత్రి సమయానికి కుక్కలు గుంపులుగా తిరుగుతూ వాహనదారులను తరుముతూ బెంబేలెత్తిస్తున్నాయి. మసీద్ చుట్టుపక్కల చికెన్ సెంటర్లు ఉండడంతో వీధి కుక్కలు అక్కడే తిష్ట వేసి దారిన పోయే వారికి ఇబ్బంది కలిగిస్తున్నాయి. పిల్లలు రాత్రి బయటకు రావడానికి జంకుతున్నారు. రోడ్డుపై తిరుగుతుండడంతో భయాందోళన చెందుతున్నారు. కుక్కల బెడద విషయంలో అధికారులు జోక్యం చేసుకుని సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

నిర్లక్ష్యం ఎవరిది ..?



వరద నీరు వెళ్లేందుకు వేసిన పెద్ద పైపులు



రెండో సారి.. నిర్మించిన చిన్న బ్రిడ్జి

జగిత్యాలఅగ్రికల్చర్: మండలంలోని కండ్లపల్లి చెరువు పూర్తిగా నిండినప్పుడు, వరద నీరు పోయేందుకు ఒకప్పుడు చిన్నపాటి మత్తడి ఉండేది. ఈ చెరువు కట్ట ద్వారా కండ్లపల్లి నుంచి చెర్లపల్లి గ్రామానికి సైతం వెళ్తుంటాయి. అయితే నీటి పారుదల శాఖ ఇంజినీర్లు మాత్రం వరద నీరు ఓ వైపు వెళ్లితే, అవగాహన రాహిత్యంతో మరోవైపు 10 పెద్ద పైపులతో బ్రిడ్జి వేశారు. తర్వాత, వరద నీరు పైపుల ద్వారా వెళ్లకుండా లోతట్టుకు వెళ్లుతుండటంతో, మరలా ఇంజినీరింగ్ అధికారులు పైపుల పక్కనే ఓ చిన్నపాటి బ్రిడ్జిని నిర్మించారు. ఈ బ్రిడ్జి కింది నుంచి వరద నీరు వెళ్తుంటుంది. ఈ బ్రిడ్జి సైతం చిన్నగా నిర్మించడం, మత్తడి ఎత్తు తక్కువ ఉందని, నీరు నిల్వడం లేదని, వచ్చిన వరద నీరు వచ్చినట్లే కిందకు పోతుందని రైతులు చెపుతున్నారు. అధికారుల నిర్లక్ష్యానికి ఈ నిర్మాణాలు నిలువుటద్దంగా మారాయి. ఈ నిర్మాణాలకు లక్షలాది రూపాయల నిధులు ఖర్చు చేసినా పెద్దగా ఉపయోగం లేదని రైతులు చెప్తుండటం గమనార్హం.

ఆధ్యాత్మిక సభకు భారీ ఏర్పాట్లు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న కమిషనర్, నాయకులు

ధర్మపురి: ఈనెల 11,12 తేదీల్లో ధర్మపురి పుణ్య క్షేత్రంలో జరగనున్న చాగంటి కోటేశ్వర్‌రావు ఆధ్యాత్మిక ప్రవచనముల కార్యక్రమానికి భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. దేవస్థానం ఈవో శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానిక బ్రాహ్మణ సంఘం పక్కనున్న శ్రీ మఠం స్థలంలో కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు. దీనికి కావల్సిన ఏర్పాట్లను చేపడుతున్నారు. స్థలాన్ని చదును చేయించి చుట్టూ లైటింగ్ ఏర్పాట్లు, ప్రత్యేక వేదిక, వాహనాల పార్కింగ్‌కు స్థలం తదితర పనులు చేపడుతున్నారు. కోటేశ్వర్‌రావు నిర్వహించే ఈ పుణ్య కార్యక్రమానికి ఉమ్మడి జిల్లాలోని వివిధ నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి భక్తులు భారీ ఎత్తున రానున్నారు. దీనికి అవసరమైన ఏర్పాట్లు చేపడుతున్నారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో శ్రీనివాస్, చైర్మన్ జక్కు రవీందర్, నాయకులు ఎస్ దినేశ్, వేములు రాజు పాల్గొన్నారు.